

# కథా కౌముది

**జడబిళ్ళ** - **అచ్యుతుని మురళీకృష్ణ**

"నాన్నా..చూడూ...నాజడ... జడబిళ్ళ బాగుందా?" అని మురిపెంగా అడుగుతోంది నా కూతురు ‘అమ్మలు‘

"చాలా బావుంది తల్లీ..." నేను అమ్మల్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుంటూ అన్నాను.

"మరి నాన్నా...ఇదీ... బామ్మ నాకిచ్చిందటగా? అమ్మ చెప్పింది"

అవునని తలూపుతూ ‘అలా చెప్పమని నేనే చెప్పాను‘ మనసులో గొణుక్కున్నాను.

మనసంతా బోసిపోయినట్లుగా ఉంది. ఈ జడబిళ్ళ గుర్తొచ్చినప్పుడల్లా చివుక్కుమంటుంది.

ఇంతలో నా పుత్రరత్నం " మరి బామ్మ నాకేమిచ్చింది? " అని అడిగాడు.

"మీ బామ్మ నీకు ఈ గోలీలు ఇచ్చింది. అవి చిన్నప్పుడు నాన్న ఆడుకున్నవి. నీకోసమే.. దాచి మరీ ఉంచింది తెలుసా? " మా ఆవిడ చెపుతోంది.

అమ్మ..నా బాల్యాన్ని నా కొడుకుకి పరిచయం చేసిన అమ్మ!!

ఎంత ముందు చూపు!? అలాంటి అమ్మకి కంటి చూపు సరిగ్గా లేనప్పుడు... నేనేం చేశాను? ఒక చిన్న అబద్ధం ఆడాను... అందులో నా స్వార్థం ఏమన్నా ఉందా అంటే... ఉందనే చెప్పాలి... అదీ... అమ్మ కళ్ళల్లో సంతృప్తిని చూడాలనే!

***

నాకిప్పటికీ గుర్తు.... ఎర్రరాయి చుట్టూ తెల్లరాళ్ళతో పొదిగిన బంగారు జడబిళ్ళ. మా అమ్మ జడను అల్లుకుని ముడిలా చుట్టుకునేది. ఆ రాళ్ళ బిళ్ళని ఆ ముడిలో అమర్చుకుంటే చూసేందుకు నీలాకాశంలో ఎర్రని చంద్రుడి చుట్టూ నక్షత్రాలు కుప్పలుగా ఒక చోట కూర్చినట్లుండేది. స్నానం చేసిరాగానే అంత కుంకుమ నుదుటన దిద్దుకొని..జడల్లుకోవటం... ముడెట్టుకోవటం.. ఆ జడబిళ్ళని పొందికగా అలంకరించుకోవటం... మడికట్టుకుని, కుంపటి ముందు కూర్చుని వంటకుపక్రమించేది. సుప్రభాతాన్ని వల్లె వేసుకుంటూ విసనకర్రతో కుంపటి రాజేసుకుంటూ వంట చేశాక కమ్మటి భోజనాన్ని వడ్డించటం పరిపాటి.

ఉదయం దువ్వుకున్న తల అస్సలు చెదిరేదికాదు. ఆ జడబిళ్ళ నిద్రపోయేముందుకానీ తీసేది కాదు. ఎప్పుడూ దాన్ని వాళ్ళ నాయనమ్మ ఇచ్చిందని మురిపెంగా చెప్పుకుంటుండేది. తన చిన్నప్పుడు బిస్సీగుడ్డతో పావడాలు, రవికెలు కుట్టించేవారని, అవి తొడుక్కుని,

వాలుజడ వేసుకుని... జడగంటలు పెట్టుకుని ఈ జడబిళ్ళని పెట్టుకునేదాన్నని ఎప్పుడూ చెపుతుండేది. అదీ.... తాను కూడా తన పెద్ద మనమరాలికే ఇవ్వాలనుకుంటున్నానని పదే పదే అంటుండేది.

ఇక మా కుటుంబ నేపథ్యానికి వస్తే మా నాన్నగారు ఉభయభాషాపండితుడు. అష్టావధానంలో అందెవేసిన చెయ్యి. అన్నింటినీ మించి చాలా అభిమానవంతుడు ఎన్ని ఇబ్బందులున్నా బయటపడే తత్వం కాదు.

ఆయన తెలుగు ఉపాధ్యాయులుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేశారు. ఆయన సర్వీసులో ఉన్నప్పుడు తమ్ముళ్ళ చదువులు, ఇంటి బాధ్యతలతో పైసా వెనకేసుకోలేదు. ఆయన పదవీ విరమణనాటికి మేము పుట్టాం. నాకు ఊహ వచ్చేనాటికి.. మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమేనని అర్థమైంది. చాలీచాలని ఫించను, ఉదయం, సాయంకాలాలు పిల్లలకి ప్రైవేట్లు చెప్పి జీవితాన్ని నెట్టుకొచ్చేవాడు. మాతోపాటే వారాలబ్బాయిలూనూ. 'ఎప్పుడైనా ఎవరైనా వారాల ఇళ్ళవాళ్ళు ఊరికి వెళితే పస్తులుండకండి నాయనా...మనింటికి వచ్చేయండి' అని అమ్మా నాన్నా ఇద్దరూ చెపుతుండేవాళ్ళు వాళ్ళకి.

తనకెంత పాండిత్యమున్నా... పాండితీ ప్రకర్షతో తమ బతుకు గడవదన్న నగ్నసత్యం మా నాన్నకు తెలుసు. కీర్తి ప్రతిష్టల తాలూకు గుంజాటన ప్రతి పండితుడికీ, కళాకారుడికీ, ఉండి తీరుతుంది. కానీ ఆయన తన ప్రతిభ, గుర్తింపు ముఖ్యమనుకోలేదు. ఆ ఉరవడిలో పడటం బాధ్యతలనుంచి తప్పించుకోవటంగా, అదొక వంకగా, పూర్తి స్వార్థంగా తోచిందాయనకు.

అదే ఆయన మాకోసం చేసిన పెద్ద త్యాగం.

ఎదిగీ ఎదగని పిల్లలు... వాళ్ళ చదువులు.. ఆడపిల్లల పెళ్ళిళ్ళు - కట్నాలు చాలా భారమని ఆయనకు తెలుసు. అలాగని నిరాశతో కుంగిపోయి మూల కూర్చోలేదు. పిల్లల్ని ఈ లోకంలోకి తెచ్చినందుకు వారిని ప్రయోజకులుగా చేయాలనే ఆయన ఆలోచన. ఆ ఆలోచనతో ఆయనేం పెద్ద పెద్ద ప్రణాళికలు వెయ్యలేదు. ఓహో ఆలోచించలేదు.

"ఈ రోజు గడిస్తే చాలు. రేపు తప్పకుండా గడిచి తీరుతుంది. ఆ తరువాత సంగతి తరువాత" అనే ఓ చిరు ఆశ... చిరు బేలత్వంలో.. బోలెడంత ధీమా. అలాగే నెట్టుకుంటూ తోసుకుంటూ బతుకు బండిని నడిపించుకుంటూ వస్తుండేవారు. ఇలా గడిచిపోతున్నప్పుడు... ఇలా గడిపించబడుతున్నపుడు లాస్ట్ స్ట్రా లా సీతాపతి బాబాయి మా ఇంటికి వచ్చాడు... భార్యా గంపెడు పిల్లలతో. ఆయన ఓ రకమైన అమాయకుడు. చదువు అబ్బలేదు. పైసా సంపాదన లేదు. ఉన్న ఆస్తంతా కరిగిపోనిచ్చాడు. అలా అప్పుడప్పుడు దగ్గర బంధువుల ఇళ్ళకి వెళ్ళటం, రోజులు గడపటం ఇదీ ఆయన వాలకం. ఆ బాబాయి అంటే నాన్నకు వల్లమాలిన ఆపేక్ష. చిన్నప్పుడు కలిసి పెరిగిన అనుబంధం కావొచ్చు. వచ్చినవాళ్ళు నెలరోజులపైనే ఉన్నారు. వెళుతూ, వెళుతూ నాన్న అందించిన టిక్కెట్టు డబ్బులు తీసుకుని మరీ వెళ్ళిపోయారు. ఆ మరుసటిరోజు అమ్మ వత్తుల పెట్టెలో స్నానానికి వెళ్ళబోతూ పెట్టిన జడబిళ్ళ వెతుక్కుంటున్నది 'ఏదీ ఎక్కడ పెట్టాను... అనుకుంటూ.... హడావుడిగా ఇల్లంతా వెతకటం మొదలు పెట్టింది. నాకు తోచినట్లు నేనూ వెతికాను. కనిపించలేదు. అమ్మ ఆ రోజు బోసి ముడితో... బోసి మదితో వంటచేసింది.

ఇంతలో నాన్న బయటనుంచి వచ్చారు. "నా జడబిళ్ళండీ.. నా జడబిళ్ళ... కనిపించటం లేదు. మీరుగానీ చూశారా? ఎక్కడ పెట్టానో ఏమిటో.." అని అడిగింది. నాన్న "నాకు తెలియద'ని గొణుగుతూ తలదించుకుని అవతలకి వెళ్ళిపోయారు. అమ్మ ఆరోజు భోజనం చేయలేదు. నాన్నకూడా భోజనం చేయలేదు. ఆయన కళ్ళలో అపరాధ భావన! అది నాకు మాత్రమే తెలుసు.... ఉదయం అమ్మ స్నానానికి వెళ్ళినప్పుడు ఆ జడబిళ్ళని నాన్న తీయటం చూశాను. నేను అమ్మకి ఆ విషయం కావాలనే చెప్పలేదు. నాన్న ఎటువంటి నిస్సహాయ పరిస్థితుల్లో ఆ పని చేశారో నేనామాత్రం గ్రహించగలను. నాన్న మీద అమ్మకు తక్కువ భావం రావటం నాకిష్టం లేదు. ఇంతలో నా ఇంటర్ పరీక్షలు... ఫలితాలు... ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. ఆ తర్వాత నేను ఇంటినుంచి బయటకు వచ్చేశాను ఇంజనీరింగ్ చదవాలన్న నా కలను పక్కకు నెట్టేశాను. చిన్న ఉద్యోగంలో కుదురుకుని ఇంటికి కొంత డబ్బు పంపించే వాడిని. కొంత నా ఖర్చులకి

సరిపోయేది. గ్రాడ్యుయేషన్ ప్రైవేటుగా పూర్తిచేసుకుని... కొన్ని పోటీ పరీక్షల్లో నెగ్గి ఉన్నతోద్యోగం సంపాయించాను. కుటుంబ బాధ్యతల్ని పూర్తిగా స్వీకరించాను.

ఈ క్రమంలో నేనేమీ అమ్మ జడబిళ్ళని మర్చిపోలేదు. నేనిప్పుడు జడబిళ్ళ చేయించి అమ్మకు ఇస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచన నన్ను నిలవనీయలేదు. కానీ అమ్మకు నేను చేయించి ఇస్తే తృప్తిగా ఉంటుందా? ఆమె ఆనందపడుతుందా? లేదు. కాబట్టి నేను అమ్మ దగ్గర చిన్న అబద్ధం ఆడక తప్పలేదు. పాత పెట్టె వెతుకుతుంటే.... ఇన్నాళ్ళూ పోయిందనుకున్న జడబిళ్ళ దొరికిందని తడబడుతూ చెప్పాను. పిచ్చి అమ్మ. నిజమేనని నమ్మింది. కళ్ళు సరిగా కనబడవు... అయినా తడిమి తడిమి చూసింది.

"మధ్యలో ఎర్రరాయేనంటావురా? చుట్టూ తెలుపు రాళ్ళుకదూ? రాళ్ళేమీ ఊడిపోలేదు కదూ? మెరుపు తగ్గిందంటా? అంత బరువు లేదురా ఇది పెట్టుకోకున్నా అరిగిపోతుందంటావా?" ఇట్లాంటి ప్రశ్నలతో నన్ను తోచనీయకుండా చేసింది. "పోనీలే నాయనా.. దొరికింది అది చాలు... ఎన్ని రోజులు... ఎన్ని చోట్ల వెతికాను... ఇల్లంతా గాలించాను. ఈ పాతపెట్టెలో కూడా చూశా. కంగారుగా వెతకటంలో కనపడివుండదు. పొరపాటున ఇంకెక్కడన్నా పడిపోయిందా అని పిచ్చిదానిలా అయిపోయేదాన్ని. ఒక్కోసారి నాయనా... మీనాన్నగారి మీద కూడా అనుమానం వచ్చేది. ఈయన కానీ... సంసారం ఖర్చులకి అమ్మేయలేదు కదా.... అని వెంటనే లెంపలు వేసుకునేదాన్ని. ఆయన్ని అనుమానిస్తున్నా... ఎంత పాపిష్టిదాన్నని, నామీద నాకే కోపం వచ్చేది. మహానుభావులు... ఎంత కష్టం తానే పడ్డారు కానీ... వెలితిపడ్డారా!? మనల్ని వెలితిపడనిచ్చారా? ఒక్కపూటైనా నేతిబొట్టు ఇంట్లో నిండిపోనిచ్చారా? పిల్లలకి లోటు రానిచ్చారా? ఎంత ఆత్మాభిమానం!? అలాంటివారి మీదకి నా అనుమానం పోవడమేమిటి నాయనా? నేనెంత దుర్మార్గంగా ఆలోచించాను? నాకిప్పటికీ గుర్తు... నేను వస్తువు పోయిందని అన్నం తినకపోతే... ఆయనా ఒక్క మెతుకూ ఎంగిలిపడలేదానాడు. సరేలే నాయనా... ఇప్పుడవన్నీ ఎందుకు? మన వస్తువు గట్టిది. దొరికింది. అది మనకు ప్రాప్తం ఉంది. నేను మా నాయనమ్మిచ్చిన వస్తువుని కాపాడుకోలేకపోయానన్న చింత నన్ను ఇన్నాళ్ళూ వేధించేది. నిజానికి.... అది మా నాయనమ్మ నా మనుమరాలికిమ్మని ఆనాడు నాకు చెప్పింది. చూశావా.... ఇన్నాళ్ళూ అనవసరంగా బెంగపడ్డా, ఇంట్లో వస్తువుని పెట్టుకుని... అందుకే అన్నారు, వస్తువు ఒకచోట.... అనుమానం మరోచోటా...అని.

ఇప్పుడు దీన్ని నేను నా మనుమరాలికి ఇచ్చుకుంటా. అది వాలుజడ వేసుకుని... ఈ జడబిళ్ళ పెట్టుకోవాలి మరి!!" మా బారసాలనాడూ మా అమ్మ, పిల్లదాని బుగ్గలు పుణికి... దాని చేతిలో 'జడబిళ్ళ' పెట్టింది.

ఆ రోజు ఆమె చత్వారం కళ్ళలోని నీటి చెమ్మ... నాకళ్ళకి కనిపించలేదు. కారణం గుండెను తడిపేంతలా.... నా కంటినిండా నీళ్ళేమరి!!

***

"నాన్నా! చెప్పవేం.. గోలీలాట ఎలా ఆడాలో?" మావాడు నన్ను కదుపుతూ అడుగుతున్నాడు.

"పద నాన్నా..." అంటూ నేను గోలీలను అందుకుని.... బయటకు నడిచాను. వాడు నన్ను అనుసరించాడు.



మురళీకృష్ణగారు హైదరాబాదులో సిండికేట్ బాంక్ మేనేజర్ గా పనిచేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు సాహిత్య పఠనం హాబీ. ఇంగ్లీషులో కవిత్వం వ్రాస్తుంటారు.